తారెత్తిస్తున్న ఎండలు



- బయటికి వస్తే చాలు సత్తువ పీల్చేస్తున్న భానుడు
- వారం రోజులుగా ఇదే పరిస్థితి
- అల్లాడుతున్న జనం
- వేసవి వ్యాధుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు

అల్లిపురం: వారం రోజులుగా సాధారణం కంటే అధికంగా ఎండలు నమోదు అవుతున్నాయి. భరించలేనంత ఉక్కపోత.. చెప్పలేనంత నీరసంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 6 గంటల నుంచే భానుడు ప్రతాపం చూపిస్తున్నాడు. పది దాటితే అడుగు బయటపెట్టలేని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ప్రజలు కొద్దిపాటి జాగ్రత్తలు పాటించడం ద్వారా వడదెబ్బ నుంచి రక్షణ పొందవచ్చని వైద్యులు చెబుతున్నారు.



ఆదివారం ఎండకు నిర్మానుష్యంగా మారిన జగదాంబ జంక్షన్



జనసంచారం లేని సూర్యాబాగ్ రోడ్డు



శీతల పానీయాల దుకాణం వద్ద రద్దీ

రోడ్లు నిర్మానుష్యం..

ఆదివారం ఆపై ఉగాది కావటంతో అల్లిపురం, చావులమదుం, సౌత్ జైలురోడ్డు, జగదాంబ, సరస్వతీ పార్కు తదితర ప్రాంతాలు దాదాపు నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. ఉదయం 10 దాటితే చాలు అడుగు బయట పెట్టేందుకు వృద్ధులు, పిల్లలు హడలిపోతున్నారు. ఆదివారం ఉగాది అయినప్పటికీ రోడ్లు ఖాళీగా దర్శనమిచ్చాయి.

వడదెబ్బకు కారణాలు..

ఎండలో ఎక్కువగా తిరగడం వల్ల వడదెబ్బకు గురవుతారు. ఎండ తీవ్రత కారణంగా శరీరంలో తేమ శాతం తగ్గిపోయినప్పుడు దీని ప్రభావం మెదడుపై పడి మనిషి అపస్మారక స్థితికి వెళ్తాడు. దీనిని వడదెబ్బకు గురైనట్లు భావించవచ్చు. పిల్లలు, వృద్ధులు, గర్భిణులపై వడదెబ్బ ఎక్కువ ప్రభావం చూపుతుంది. ఏడాదిలోపు పిల్లల్ని చల్లని ప్రదేశంలో పడుకోబెట్టాలి. అలా వడదెబ్బ నుంచి పిల్లల్ని రక్షించుకోవచ్చు.

తప్పనిసరి పరిస్థితుల్లో..

తప్పనిసరి పరిస్థితుల్లో బయటికి వెళ్లాల్సి వస్తే గొడుగు తీసుకెళ్లాలి. వాహన చోదకులు హెల్మెట్లు ధరించాలి. మహిళలు చున్నీలు ముఖానికి చుట్టుకుని ప్రయాణించాలి. పండ్ల రసాలు, కొబ్బరి బొండాలు, మజ్జిగ, షర్బత్, ఖర్బూజా వంటివి తీసుకోవాలి. ప్రతి రోజు కనీసం 4 లీటర్ల నీళ్లు తీసుకోవాలని వైద్యులు చెబుతున్నారు. ఎండ తీవ్రంగా ఉన్న సమయాల్లో బయటికి వెళ్లకుండా, పనులు వాయిదా వేసుకోవడమే ఉత్తమమంటున్నారు.



ఎండ వేడికి సోడాలు తాగుతున్న పాదచారులు



జనసంచారం లేని అల్లిపురం మెయిన్‌రోడ్డు

ఎండల్లో ఆరోగ్యం జాగ్రత్త..



ఎండల్లో తిరగడం మంచిది కాదు. ముఖ్యంగా చంటి పిల్లలు ఎండ తాపానికి గురి కాకుండా చూడాలి. అనారోగ్య సమస్యలున్న వారు బయట తిరగడం మంచిది కాదు. ఇలాంటి వారు త్వరగా వడదెబ్బకు గురవుతారు. కొందరు పిల్లల్లో ముక్కు నుంచి రక్తం వస్తుంది. డీహైడ్రేషన్ లక్షణాల్లో ఇదొకటి. మూత్రం పచ్చగా వస్తే అప్రమత్తమవ్వాల్సిందే. వేసవిలో నీళ్లు ఎక్కువగా తాగాలి. ఘన పదార్థాలు సహించవు. ఎక్కువ ద్రవ పదార్థాలు తీసుకోవాలి. లేకుంటే వడదెబ్బకు గురి కావాల్సి వస్తుంది.

– డాక్టర్ ఆక్వాస పర్వీన్, వైద్యాధికారి, కొబ్బరితోట పీహెచ్‌సీ

క్లుప్తంగా

పేదలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న దేవరకొండ మార్కండేయులు

దాబాగార్డెన్స్: రంజాన్ పండగ సందర్భంగా దేవరకొండ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం బీచ్‌రోడ్డు, ఆర్‌కే బీచ్ వద్ద నిరుపేదలకు అన్నదానం చేశారు. వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్స్ విభాగం అధ్యక్షుడు, యాసీన్ మసీద్ సహాయ కార్యదర్శి, ఫౌండేషన్ ప్రతినిధి దేవరకొండ మార్కండేయులు నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బోని శివరామకృష్ణ పాల్గొన్నారు.

గంజాయితో యువకుడి అరెస్ట్

అల్లిపురం: గంజాయి కలిగి ఉన్న ఒక మైనర్ సహా యువకుడిని టూటౌన్ పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. సీఐ ఎర్రంనాయుడు తెలిపిన వివరాల ప్రకారం ఎన్‌టీఆర్ కృష్ణా జిల్లాకు చెందిన షణ్ముఖ్ (18) ఒక బాలుడితో కలిసి అరకు నుంచి కేజిన్నర గంజాయి తీసుకుని ఆర్టీసీ కాంప్లెక్స్‌కు చేరుకున్నాడు. ఈ మేరకు పోలీసులు తమకు అందిన సమాచారం మేరకు వారిని సెంట్రల్ పార్కు పార్కింగ్ స్థలంలో గుర్తించి తనిఖీలు నిర్వహించారు. వారి వద్ద కేజిన్నర గంజాయి స్వాధీనం చేసుకుని షణ్ముఖ్‌ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బాలుడిని హోమ్‌కు అప్పగించారు.

బైకుల దగ్ధం ఘటనలో మహిళ అరెస్ట్

అల్లిపురం: శనివారం తెల్లవారు జామున సింగ్‌హోటల్ జంక్షన్ సమీపంలోని గ్రూపు హౌస్ సెల్లార్‌లో బైకుల దగ్ధం కేసులో ఒక మహిళను అరెస్ట్ చేసినట్లు సీఐ ఎర్రంనాయుడు తెలిపారు. అదే గ్రూపు హౌస్‌లో గల ఒక వ్యక్తితో గల వివాదం కారణంగా ఆ మహిళ అతను రెండు రోజుల క్రితం కొనుక్కున్న హోండా షైన్ బైక్‌ను దగ్ధం చేసింది. దీంతో బైక్ పక్కనే గల ఇతర బైకులకు మంటలు వ్యాపించడంతో సుమారు 15 బైకులు దగ్ధమయ్యాయి. సీసీ కెమెరాలను పరిశీలించగా ఘటనకు కారణమైన మహిళను గుర్తించారు. ఆమెను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఘటన జరిగిన 12 గంటల వ్యవధిలోనే నిందితురాలిని అదుపులోకి తీసుకోవడంతో పోలీస్ కమిషనర్ డాక్టర్ శఖబ్రత బాగ్చి అభినందించారు.

చదువుకు పేదరికం అడ్డు కారాదు



అశోక్‌కు మెమెంటో అందజేస్తున్న రామన్నపాత్రుడు

దాబాగార్డెన్స్: చదువుకు పేదరికం అడ్డు కారాదని, బీసీ విద్యార్థుల అభివృద్ధికి తన వంతు సాయం ఎప్పుడూ ఉంటుందని జాతీయ బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంట్రెడ్డి రామన్నపాత్రుడు పేర్కొన్నారు. విశాఖ జిల్లా రావికమతం మండలం, మర్రివలసలో పేద రైతు కూలీ ఇంట జన్మించిన అమ్మిరెడ్డి అశోక్ చిన్నతనం నుంచి చదువు పట్ల శ్రద్ధతో ట్రిబుల్ ఐటీలో ప్రవేశం పొంది, ఈ ఏడాది గేట్‌లో 12వ ర్యాంకు సాధించడం సంతోషకరమని రామన్నపాత్రుడు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో అమ్మిరెడ్డి అశోక్‌ను సత్కరించి మెమెంటో అందజేశారు.

రంజాన్ వేడుకలకు మసీదులు సిద్ధం



భోజనాలు వడ్డిస్తున్న యువకులు

అల్లిపురం: రంజాన్ ఉత్సవాలకు అల్లిపురంలోని యాతపేట, చావులమదుం దరి కేరళ మసీదు, రిజర్వ్‌లైన్ మసీదులు ముస్తాబయ్యాయి. యాతపేట మసీదు వద్ద గత నాలుగు ఆదివారాలు ఉపవాసంలో ఉన్న ముస్లింలకు సహారి యుక్తారి భోజనాలు పెట్టారు. సోమవారం రంజాన్ సందర్భంగా మసీదులు రంగు రంగుల విద్యుద్దీపాలు, స్వాగత ద్వారాలతో ఆకట్టుకుంటున్నాయి. వేడుకలకు షేక్‌మదీనా, షేక్ హుస్సేన్, షేక్ సిలార్, భరకతుల్లా తమ సేవలందించారు.



విద్యుద్దీపాలంకరణలో యాతపేట మసీదు

తల్లికి వందనం ఎక్కడ? 96 గజాల స్థలం ఏదీ?

సీపీఎం జగదాంబ జోన్ కమిటీ సూటి ప్రశ్న



జగదాంబ జంక్షన్లో నిరసన తెలుపుతున్న సీపీఎం ప్రతినిధులు

దాబాగార్డెన్స్: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని సీపీఎం జగదాంబ జోన్ కమిటీ కన్వీనర్ ఎం. సుబ్బారావు ఆదివారం ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడాన్ని నిరసిస్తూ వినూత్నంగా ప్రదర్శన చేపట్టారు. తల్లికి వందనం ఎక్కడ? 96 గజాల స్థలం ఏదీ? మహిళలకు ఇవ్వాల్సిన రూ.15 వేలు ఎవరి ఖాతాలో పడ్డాయి? గ్యాస్ సిలిండర్ల డబ్బులు ఎంత మందికి వచ్చాయి? మహిళలకు ఉచిత బస్సు తుస్సేనా? కరెంటు చార్జీలు పెంచమని చెప్పి మాట తప్పిన అంశం.. స్మార్ట్ మీటర్ల పరిస్థితి ఏంటి? అంటూ ఎన్నో ప్రశ్నలు కూటమి ప్రభుత్వంపై సంధించారు. సిటు నాయకుడు వై. రాజు నేతృత్వంలో కళాఖండాలు ప్రదర్శించారు. జగదాంబ జోన్ ఇన్‌చార్జి పి. మణి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కల్లబొల్లి మాటలతో అధికారంలోకి వచ్చిందని, 6 గ్యారంటీలు నెరవేరుస్తామని విశాఖ స్టీల్‌ప్లాంట్‌ని ప్రైవేట్‌పరం చేయబోమని, సొంత గనులు ఇప్పించే బాధ్యత తీసుకుంటామని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనుల కోసం మాట్లాడకపోవడం సిగ్గు చేటన్నారు. మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కి సొంత గనుల కోసం ఢిల్లీ చుట్టూ తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. మత్స్యకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కర్రి చంద్రశేఖరం మాట్లాడుతూ మత్స్యకారుల వేట నిషేధ కాలంలో వారి భృతి రూ.20 వేలకు పెంచుతామని చెప్పి, ఇంత వరకు ఇవ్వకపోవడం, కనీసం సర్వే కూడా చేయకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు కె. గణేష్, సంతోష్‌కుమార్, సంజయ్, సిటు నాయకుడు చంద్రమౌళి, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకుడు కె. నర్సింగరావు, సిమ్మనాయుడు, రామకృష్ణారావు, సూరీడు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా రాములోరి పెళ్లి రాట



సీతారామచంద్రస్వామి ఆలయంలో కల్యాణం రాట వేస్తున్న ఏఈవో తిరుమలేశ్వరరావు తదితరులు



29వ వార్డు దిబ్బలపాలెంలో స్వామి పెళ్లి రాట వేస్తున్న ముత్తయిదువులు



కుమ్మరవీధి రాట మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయ దత్తత దేవాలయమైన అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయంలో ఆదివారం రాములోరి పెళ్లి రాటోత్సవం వేడుకగా సాగింది. శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా ఉదయం కల్యాణం రాట వేసి, స్వామిని పెళ్లి కుమారుని చేశారు. అనంతరం విశేష ఆరాధన, పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఏప్రిల్ 6న శ్రీరామనవమి వేడుకలు వైభవంగా నిర్వహించనున్నారు. ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు, ప్రధాన అర్చకుడు బాలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దిబ్బలపాలెం రామాలయంలో..

మహారాణిపేటలోని దిబ్బలపాలెంలో గల సీతారామచంద్రుల పెళ్లి రాట వేడుక కనువిందుగా నిర్వహించారు. సీతారామ సేవా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కమిటీ అధ్యక్షుడు చందక అప్పలరాజు మాట్లాడుతూ ఏప్రిల్ 6న సీతారాముల కల్యాణం నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు పసగాడ రామలింగేశ్వరరావు, మొల్లి వెంకట రమణ, చందక ప్రభాకరరావు, శ్రీనివాసరావు, చిటికిరెడ్డి పవన్‌కుమార్, లక్ష్మణరావు (డాక్యుమెంట్ రైటర్), పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

వేడుకగా పెళ్లి రాట..

అల్లిపురం: బంగారుమెట్ట, శ్రీ రామ ఆంధ్ర యువజన సమాజం, గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా రాములోరి పెళ్లి రాట కార్యక్రమం నిర్వహించారు. మద్దాల కిరణ్‌కుమార్, గౌతమి దంపతులు పెళ్లి రాటకు పూజలు చేశారు. సమాజం అధ్యక్ష, కార్యదర్శులు భీశెట్టి హనుమంతరావు, బీమరశెట్టి రమేష్, బంగారుమెట్ట ప్రజలు పాల్గొన్నారు.

కుమ్మరవీధి రామాలయంలో..

కుమ్మరవీధి రామాలయంలో అర్చకుడు శర్మ రాట కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా చేపట్టారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి శ్రీహరిరెడ్డి, బసవ శంకర్, పంది సంజీవరెడ్డి, పరమేషు, మణి పాల్గొన్నారు.

ముస్లింలకు వాసుపల్లి రంజాన్ తోఫా



ముస్లింలకు రంజాన్ తోఫా అందిస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

దాబాగార్డెన్స్: నియోజకవర్గంలోని ముస్లింలకు మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ రూ.28 వేలు రంజాన్ తోఫా అందజేశారు. 39వ వార్డుకి చెందిన సలీం ఇబ్రహీంతో పాటు మరో 14 ముస్లిం కుటుంబాలకు తోఫా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో దర్గా నిర్మాణంలో తాను కూడా కూలీలా పని చేశానన్నారు. నియోజకవర్గం తాను పుట్టి పెరిగిన ప్రాంతమన్నారు. ఇక్కడి ముస్లిం సోదరులతో తనది విడదీయరాని బంధమన్నారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచానంటే తన సామాజిక వర్గం మత్స్యకారులతో పాటు ముస్లిం సోదరుల సహకారం కూడా ఉందన్నారు. షాదీఖానా కల్యాణ మండపం నిర్మాణం, దర్గా అభివృద్ధిలో ఎమ్మెల్యేగా వారికి సేవలందించగలిగానన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుకు కూటమి ప్రభుత్వం మద్దతు ఉపసంహరించుకోవాలని, ముస్లింలంతా రంజాన్‌లో ప్రభుత్వం చేపట్టిన ఇఫ్తార్ విందును తిరస్కరించారన్నారు. ముస్లింలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని వాసుపల్లి తెలిపారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన ఉగాది సంబరాలు

కిటకిటలాడిన దేవాలయాలు



నీలమ్మ వేపచెట్టు అమ్మవారు



శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి



అచ్చియ్యమ్మపేట సాయిబాబాను దర్శించుకుంటున్న భక్తులు



శ్రీవత్సవ్‌కు వేంకటేశ్వరస్వామి చిత్రం బహూకరిస్తున్న సూరాడ అప్పారావు, పిల్లలు



సెంట్రల్ పార్క్‌లో ఉగాది ఉత్సవాల్లో పాల్గొన్న విద్యార్థులు, వాకర్లు



వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు



ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు



పాపాహోంలో పంచాంగ శ్రవణం చేస్తున్న సూర్యనారాయణమూర్తి

అల్లిపురం: శ్రీ విశ్వావసు నామ ఉగాది వేడుకలు అంబరాన్నంటాయి. అల్లిపురం, వెంకటేశ్వరమెట్టపై వెలసిన ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం, అలివేలు మంగమ్మ ఆలయం, సూర్యనారాయణస్వామి ఆలయం, ఆంజనేయ స్వామి ఆలయం, సాయిబాబా దేవాలయాల్లో భక్తులు పూజలు చేశారు. బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవాలయ అర్చకుడు గొడవర్తి రాఘవాచార్యులు ఆధ్వర్యంలో భక్తుల గోత్రనామాలతో సహస్ర నామాభిషేకాలు, ఉత్సవ విగ్రహాలకు పూజలు నిర్వహించారు. ఉగాది పచ్చడి పంపిణీ చేశారు.

నీలమ్మ వేపచెట్టు అమ్మవారి దేవాలయంలో..

అస్సాంగార్డెన్స్‌లోని నీలమ్మ వేపచెట్టు అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. అర్చకుడు జోగారావు శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఉగాది పచ్చడి, పులిహోర, మజ్జిగ ప్రసాదంగా అందజేశారు.

అచ్చియ్యమ్మపేట సాయిబాబా దేవాలయంలో..

శ్రీ షిర్డీ సాయి ధ్యాన మందిరంలో భక్తుల గోత్రనామాలతో పూజలు చేశారు. బాబాను దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు.

శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో..

టూటౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో అర్చకుడు భార్గవ శర్మ ఆధ్వర్యంలో చంద్రమౌళీశ్వర స్వామికి విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు.

నిరాశ్రయ వసతి గృహంలో..

సీతమ్మధార: టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లో గల నిరాశ్రయ వసతి గృహంలో ఉగాది సంబరాలు నిర్వహించి ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. వసతి గృహం కార్యదర్శి ప్రగడ వాసు మాట్లాడుతూ విశ్వా వసు సంవత్సరంలో అంతా మంచే జరుగుతుందని నిరాశ్రయులకు భరోసా కల్పించినట్లు తెలిపారు.

దైవానుగ్రహంతో రాశులు అనుకూలిస్తాయి..

దాబాగార్డెన్స్: పోలీస్ రిజర్వ్ బ్యారెక్స్ పాపా హోమ్‌లో భారత్ వికాస్ పరిషత్ విశాఖ శాఖ, ఝాన్సీలక్ష్మీబాయి మహిళా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు నిర్వహించారు. పాపాహోమ్ అధ్యక్షుడు డి. సూర్యప్రకాశరావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. బ్రహ్మశ్రీ కె. సూర్యనారాయణమూర్తి పంచాంగ శ్రవణం చేశారు. దైవానుగ్రహంతో రాశులు అనుకూలిస్తాయన్నారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, భారత్ వికాస్ పరిషత్ జాతీయ స్థాయి ప్రతినిధి రమేష్‌చంద్ జైన్, ప్రాంతీయ స్థాయి ప్రతినిధి ఎంవీవీ సత్యనారాయణ, బీవీపీ విశాఖ శాఖ ప్రతినిధులు సీహెచ్‌వీ సత్యనారాయణ, పి. భాస్కరరావు, జీఎస్‌వీ మాణిక్యాలరావు, పంపాన వెంకటేశ్వరరావు, పాపాహోమ్ పిల్లలు పాల్గొన్నారు.

శ్రీవత్సవ్‌కు వేంకటేశ్వరస్వామి చిత్రం బహూకరణ..

పాతనగరంలో గల స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ద్రోణంరాజు శ్రీవత్సవ్‌కు వేంకటేశ్వరస్వామి చిత్రం బహూకరించారు. సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, ట్యూషన్ పిల్లలు పాల్గొన్నారు.

బల్దేవ్స్ ఆధ్వర్యంలో..

సీతమ్మధార: అంతరించిపోతున్న కళల్లో కర్ర సాము ఒకటని, అనేక సంవత్సరాలుగా ఆ కళను పలువురికి నేర్పిస్తున్న బీపీ లక్ష్మణ్‌దేవ్‌ను సెంట్రల్ పార్క్ వాకర్స్ అసోసియేషన్ సెక్రటరీ రాము కొనియాడారు. బల్దేవ్స్ ఇండియన్ ట్రెడిషనల్ మార్షల్ ఆర్ట్స్ (కర్ర సాము, కత్తి సాము) ఆధ్వర్యంలో సెంట్రల్ పార్క్‌లో ఉగాది ఉత్సవాలు నిర్వహించారు. అందరికీ ఉగాది ప్రసాదం పంచిపెట్టారు. వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో పాటు చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వాసుపల్లి కార్యాలయంలో..



ఉగాది సంబరాల్లో వాసుపల్లి గణేష్‌కుమార్

దాబాగార్డెన్స్: మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ కార్యాలయంలో ఘనంగా ఉగాది సంబరాలు జరుపుకున్నారు. పార్టీ నాయకులు వాసుపల్లికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వాసుపల్లి నియోజకవర్గ ప్రజలు, పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డికి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. 2029లో వచ్చేది జగన్ 2.0 ప్రభుత్వమేనన్నారు. ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు, పవన్‌కల్యాణ్ పదవులను దుర్వినియోగం చేస్తే పాతాళానికి వెళ్లిపోవడం ఖాయమన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పేదల ముంగిట్లో సంక్షేమాన్నందించి పండగ వాతావరణం కల్పించే వారన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలకు పంగనామాలు పెట్టిందని వాసుపల్లి విమర్శించారు. గురజాపు రవి, నీలాపు సర్వేశ్వరరెడ్డి, పీతల వాసు, ముత్తాబత్తుల రమేష్, అలపన కనకరెడ్డి, ముజీబ్‌ఖాన్, కనకల ఈశ్వరరావు, తాడి రవితేజ, బెవర మహేష్, వాసుపల్లి బంగారమ్మ, బొండాడ వెంకట్రావు, ఆకుల శ్యామ్, సూర్యనాయుడు, సుధా, కృష్ణకుమార్, నవీన్, గంగాధర్, మౌలీష్, కరుణాకర్ రెడ్డి, వినోద్, ఆరుగుల రాజు, కోట ఆనంద ప్రసాద్, గుమ్మడి చంద్రమౌళి, పట్నాల ఆనందరావు, మల్ల బుజ్జి, రవికుమార్, దుర్గా, కుమారి, సత్తిబాబు, ప్రసాద్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

సంగీత సమితి సేవలు ప్రశంసనీయం



సంగీత సమితి ప్రథమ వార్షికోత్సవంలో పాల్గొన్న డాక్టర్ రవిరాజు, అతిథులు

సీతంపేట: ఐ.వి.ఎల్.శాస్త్రి సంగీత సమితి ప్రథమ వార్షికోత్సవం స్థానిక శంకరమఠంలో ఆదివారం ఘనంగా జరిగింది. శంకరమఠం అధ్యక్షుడు డాక్టర్ టి.రవిరాజు జ్యోతి వెలిగించి వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివంగత ఐ.వి.ఎల్.శాస్త్రి పేరిట సంగీత సంస్థను స్థాపించి, తద్వారా నిర్వహించిన సంగీత సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. శాస్త్రి జీవితం ఎందరికో ఆదర్శంగా నిలిచిందన్నారు. అతిథులు జి.ఆర్.కె.ప్రసాద్, వీవీబీ శంకరం, వి.ప్రకాశరావు సంగీత సమితి సేవలను కొనియాడారు. సంస్థ శిష్య బృందం ఆలపించిన సంకీర్తనలు, భక్తి గీతాలు ఆహుతులను రంజింపజేశాయి. ఐ.వి.ఎల్.సంగీత సమితి చైర్మన్ ఆకొండి వెంకటరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్, కె.సుబ్రహ్మణ్యం, పి.జగన్మోహన్‌రావు, శంకరమఠం వేద విద్యార్థులు, సంగీత అభిమానులు పాల్గొన్నారు.